మధ్యాహ్న భోజనం తనిఖీ



మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు బాబునాయుడు

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం బీఎస్ ఆర్ పేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజనాన్ని జెడ్పీటీసీ ఎం.ఎస్ బాబునాయుడు తనిఖీ చేశారు. వంటావార్పు చేసే విధానం, శుభ్రత, మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నారా లేదా ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పిల్లలకు రుచికరమైన భోజనం వడ్డించాలన్నారు. పాఠశాల అభివృద్ధితోపాటు పరిశుభ్రత ముఖ్యమని సూచించారు.

ఘనంగా గౌతు లచ్చన్న జయంతి



సర్దార్ గౌతు లచ్చన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

చిత్తూరు రూరల్: నగరంలోని ఈడిగ సంఘ కార్యాలయంలో బుధవారం సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని ఆ సంఘ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. లచ్చన్న చిత్రపటం వద్ద నివాళులర్పించి సేవా కార్యక్రమాలు చేపట్టారు. నాయకులు వినోద్‌గౌడ్, నాగరాజు, మురళి, దీన, వేణు తదితరులు పాల్గొన్నారు.

ఈఈకి సన్మానం



ఈఈని సన్మానిస్తున్న ఉద్యోగులు

చిత్తూరు కార్పొరేషన్: విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ చూపినందుకు ట్రాన్స్‌కో ఈఈ పద్మనాభపిళ్లై ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం ఈఈ కార్యాలయంలో ఆయన్ను ఉద్యోగులు సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

వేధింపులతోనే వచ్చేశాను



మాట్లాడుతున్న వైష్ణవి

చిత్తూరు రూరల్: భర్త, కుటుంబ సభ్యుల వేధింపులతోనే నాలుగు నెలల క్రితం ఇంటి నుంచి వచ్చేశానంటూ పలమనేరు మండలం గంటావూరుకు చెందిన వైష్ణవి పేర్కొంది. చిత్తూరు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆ యువతి విలేకరులతో మాట్లాడింది. ప్రేమించిన విషయం ఇంట్లో తెలిసి తనకు బలవంతంగా బంధువులకు ఇచ్చి పెళ్లి చేశారని ఆరోపించింది. కట్టుకున్న వ్యక్తి బెదిరింపులు, వేధింపులు తాళలేక నాలుగు నెలల క్రితం ఇంటి నుంచి వచ్చేశానని తెలిపింది. దీంతో తన కుటుంబ సభ్యుల నుంచి ప్రాణహాని ఉందని, అందుకే ఎస్పీని కలిసి ఫిర్యాదు చేశానని చెప్పుకొచ్చింది. తాను ఇంటి నుంచి రావడం వెనుక ఎవరి హస్తం లేదని తెలిపింది.

మైనారిటీల సంక్షేమానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర మైనారిటీ మోర్చా నాయకులు

చిత్తూరు రూరల్: మైనారిటీల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని బీజేపీ రాష్ట్ర మైనారిటీ మోర్చా అధ్యక్షులు షేక్‌బాజీ అన్నారు. చిత్తూరు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ మైనారిటీ సంక్షేమానికి అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు రామచంద్రుడు, రఘురాం రెడ్డి, చిట్టి బాబు, చాంద్ బాషా, రహమాన్, రెడ్డి మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

అబాకస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



బహుమతులు పొందిన యూసీమస్ అబాకస్ సంస్థ విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చాటారని యూసీమాస్ సంస్థ నిర్వాహకురాలు భార్గవి తెలిపారు. ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 15న గుంటూరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో చిత్తూరు నుంచి 90 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. ఇందులో నలుగురు చాంపియన్‌షిప్ సాధించగా, 15 మంది రన్నరప్‌గా నిలిచారన్నారు. ప్రతిభ చాటి న విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్, నగదు బహుమతి అందించారని ఆమె వెల్లడించారు.

సరికొత్తగా స్మార్ట్ రోడ్డు

- నూతన హంగులతో విస్తరణ పనులు
- రూ.కోటితో ఆఫీసర్స్ లైన్ రోడ్డు విస్తరణ
- వచ్చేనెలలో పూర్తయ్యేలా నగరపాలక యంత్రాంగం కసరత్తు





చిత్తూరు ఆఫీసర్స్ లైన్ వద్ద విస్తరణ పనులు, ఓవర్ బ్రిడ్జిపై రోడ్డు పనులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరం రూపురేఖలు క్రమంగా మారుతున్నాయి. అంచెలంచెలుగా నగర అభివృద్ధికి పాలకవర్గం అడుగులు వేస్తోంది. ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని అనుమతులు జారీచేస్తూ నిధులను సకాలంలో విడుదల చేస్తోంది. చిత్తూరు నగరంలో ప్రస్తుతం షర్మన్ బాలికల పాఠశాల నుంచి గాంధీ విగ్రహ కూడలి వరకు స్మార్ట్ రోడ్డు పనులు చకచకా జరుగుతున్నాయి. వచ్చేనెలాఖరులోపు స్మార్ట్ రోడ్డు పనులు పూర్తిచేయాలని మునిసిపల్ కార్పొరేషన్ యంత్రాంగం సంకల్పించింది.

విస్తరణతో కొత్తగా..

నగరంలో ఇప్పటికే గాంధీ విగ్రహ కూడలి, గంగినేనిచెరువు పార్కు, ఎంఎస్ఆర్ కూడలిని సరికొత్తగా అభివృద్ధి చేసి చూపించిన కార్పొరేషన్ యంత్రాంగం, ప్రజల ఆదరణను సంపాదించుకుంది. దీంతో ఈసారి కొంగారెడ్డిపల్లె ఆఫీసర్స్ లైన్ నుంచి ఓవర్ బ్రిడ్జి మీదుగా గాంధీ విగ్రహం వరకు రోడ్డు విస్తరణతో పాటు ప్రజల కోసం బస్ షెల్టర్లను కొత్తగా నిర్మించేందుకు వడివడిగా కదులుతోంది. దీనికి స్థానిక ఎమ్మెల్యే శ్రీనివాసులు ప్రతిపాదించగా, కార్పొరేషన్ మేయర్ అముదతో పాటు పాలకవర్గం ఆమోదించింది. స్మార్ట్ రోడ్డు పనులకు ప్రభుత్వం అనుమతులు జారీ చేసి, నిధుల వినియోగానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కొంగారెడ్డిపల్లెలోని షర్మన్ బాలికల పాఠశాల నుంచి గాంధీ రోడ్డు వరకు సుమారు కిలో మీటరుకు పైగా పనులను ప్రారంభించనున్నారు. ఇప్పటికే ఉన్న 40 అడుగుల వెడల్పుతో ఉన్న రోడ్డు కొన్నిచోట్ల ఆక్రమణలకు గురయ్యింది. దీన్ని రెండువైపులా విస్తరించి ఓవర్ బ్రిడ్జిపై గతుకుల రోడ్డును బాగుచేయించి గాంధీ విగ్రహం వరకు సరికొత్తగా రోడ్డు వేయనున్నారు. కలెక్టర్ బంగ్లా, పీసీఆర్ కూడలితోపాటు గాంధీ విగ్రహం పక్కన మూడు బస్టాప్‌లను కార్పొరేట్ తరహాలో నిర్మించనున్నారు. మునిసిపల్ కార్పొరేషన్‌కు ఆదాయం సమకూరేలా గాంధీ విగ్రహం వద్ద భారీ డిజిటల్ బోర్డును ఏర్పాటు చేసి ప్రైవేటు సంస్థలు, వ్యక్తుల ద్వారా ప్రకటనలు ఇచ్చుకునేందుకు అనువుగా మార్చనున్నారు. ఇక రోడ్డు దాటే క్రమంలో జీబ్రాలైన్ గుర్తులు, రోడ్డు సూచికలు ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే ప్రారంభమైన పనులను సెప్టెంబర్ నెలాఖరులోపు పనులు పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

వీటిని కాస్త చూడాలి..

మరోవైపు ఇటీవల కొంగారెడ్డిపల్లెలో వాహన రాకపోకలు ఎక్కువయ్యాయి. ఫలితంగా షర్మన్ పాఠశాల నుంచి పుత్తూరు రోడ్డులోని ప్రభుత్వ ఐటీఐ వరకు రోజురోజుకూ ట్రాఫిక్ కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. ఉదయం పిల్లల్ని పాఠశాలలకు తీసుకెళ్లే సమయం.. సాయంత్రం 5 నుంచి 7 గంటల మధ్యలో ఈ రోడ్డు రద్దీగా మారిపోతోంది. రోడ్డు స్థలం కబ్జా చేసి ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపట్టిన వాళ్లు కొందరైతే, తోపుడు బళ్లు, బంకుల్లాంటి వాటిని రోడ్డుపై పెట్టేసిన వాళ్లు మరికొందరు. ఇక్కడ కూడా విస్తరణ పనులు చేపట్టాల్సిన అవసరం ఏర్పడింది. విస్తరణతో పాటు గాండ్లపల్లె మునిసిపల్ పాఠశాల వద్ద ఉన్న మూడు రోడ్ల కూడలిని వన్-వే గా వాహనాల రాకపోకల కోసం ఉపయోగించేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ఇంకా చేయాలి



చిత్తూరు నగరంలో ఇదివరకు ఉన్న వసతులు, ప్రస్తుతం ఏర్పాటు చేస్తున్న మౌళిక వసతులు ప్రజల కోసమే. మేం రూపొందిస్తున్న ప్రణాళికలకు ప్రభుత్వం నుంచి అనుమతులు వస్తుండడంతో పాటు ఎప్పటికప్పుడు ఎమ్మెల్యే నుంచి పాలక వర్గం వరకు ఆమోదం తెలుపుతూ ప్రోత్సహిస్తోంది. నగరంలో ఇంకా చేయాల్సిన అభివృద్ధి పనులు చాలా ఉన్నాయి. అన్నింటికంటే ఎక్కువగా ప్రజల సహకారం ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుంది. నగర వాసులు పన్నులు సకాలంలో చెల్లించి విస్తరణ పనులకు తోడ్పాటు అందించాలి.

– డా.అరుణ, కమిషనర్, చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్

నేడు సచివాలయ కన్వీనర్ల సమావేశం

తవణంపల్లె: స్థానిక కాణిపాకం రోడ్డులోని నారాయణాద్రి కల్యాణమండపంలో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు పూతలపట్టు నియోజకవర్గ స్థాయి సచివాలయ కన్వీనర్ల సమావేశం ఉంటుందని పూతలపట్టు ఎమ్మెల్యే ఎం.ఎస్. బాబు తెలిపారు. సచివాలయ కన్వీనర్లకు జేసీఎస్ నమోదు శిబిరాల నిర్వహణపై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలోని సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు తప్పక హాజరుకావాలని ఆదేశించారు.

నేత్రపర్వంగా అంకాళపరమేశ్వరి ఊరేగింపు



నగర వీధుల్లో ఊరేగుతున్న అంకాళపరమేశ్వరి

చిత్తూరు రూరల్: అమావాస్యను పురస్కరించుకుని నగరంలోని గుర్రప్పనాయుడు వీధిలో ఉన్న శ్రీ అంకాళపరమేశ్వరి ఊరేగింపు బుధవారం నేత్రపర్వంగా సాగింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మూలస్థానంలోని అమ్మవారికి అభిషేక పూజలు చేయించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు అమ్మవారికి ప్రీతికరమైన పదార్థాలను నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి అమ్మవారిని నగర వీధుల్లో ఊరేగించారు. భక్తులు అమ్మవారికి అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించారు.

వరసిద్ధునికి రూ.లక్ష విరాళం



ఆలయ అధికారులకు విరాళం అందిస్తున్న దాత కుటుంబ సభ్యులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి నిత్య అన్నదానానికి రూ.లక్ష విరాళాన్ని చంద్రగిరికి చెందిన ధనుష్ కుమార్ రెడ్డి ఆన్‌లైన్ ద్వారా అందించారు. దాత కుటుంబ సభ్యులకు ఆలయ అధికారులు స్వామి వారి ప్రత్యేక దర్శనం కల్పించి, ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి, ఇన్‌స్పెక్టర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ధ్యాన మహా యజ్ఞం

తవణంపల్లె: మండలంలోని సిద్ధంపల్లె సమీపంలో ఉన్న శ్రీ విఘ్నేశ్వర పిరమిడ్ మహా శక్తి క్షేత్రంలో ఈ నెల 18 నుంచి 28వ తేదీ వరకు సామూహిక సంకల్ప ధ్యాన మహా యజ్ఞం నిర్వహించనున్నట్లు గ్లోబల్ స్పిరిచ్యువల్ ట్రస్టు వ్యవస్థాపకులు డాక్టర్ బి.గోపాలకృష్ణమూర్తి, కన్వీనర్ రాధిక తెలిపారు. ప్రతి రోజూ సామూహిక సంగీత ధ్యానం, సామూహిక మౌన ధ్యానం, ఆత్మజ్ఞాన సందేశాలు, స్వాధ్యాయం, సజ్జన సాంగత్యం, ధ్యాన ప్రచారం, సేవా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పాఠశాల హెచ్‌ఎం దేవకి, ఉపాధ్యాయులు



అధ్యాపకులను సన్మానిస్తున్న ప్రిన్సిపల్ రెడ్డిరామరాజు

యాదమరి: మండలంలోని బుడితరెడ్డి పల్లె ప్రాథమిక పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను బుధవారం ఘనగా సన్మానించారు. బదిలీ అయిన ఉపాధ్యాయులు షకీల్ అహ్మద్, వేణుగోపాల్, సంపత్‌కుమార్, శ్రీనివాస్‌రావు, హరీష్, వీరయ్యను పాఠశాల ఉపాధ్యాయులు సాయంత్రం పాఠశాల ఆవరణలో పూలమాలలు వేసి, శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం దేవకి పాల్గొన్నారు.

ఆత్మీయ వీడ్కోలు

ఐరాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సెరికల్చర్ అధ్యాపకులు వంశీ, వృక్షశాస్త్రం అధ్యాపకుడు ఆంజినేయులు, కళాశాల అంటెడర్ చంద్రయ్యకు బుధవారం వీడ్కోలు సభ నిర్వహించారు. వంశీ పలమనేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు, ఆంజనేయులు చిత్తూరు పీసీ ఆర్ కళాశాలకు, చంద్రయ్య పాకాల ప్రభుత్వ జూనియర్ కళాశాలకు బదిలీ అయ్యారు. దీంతో వీరికి కళాశాల ప్రిన్సిపల్ రెడ్డిరామరాజు ఆధ్వర్యంలో అధ్యాపకులు శాలువా, పూలమాలలు వేసి సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కోమల, ఎస్ఎస్ఏస్ పీఓ శ్రీనివాసులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కాలు జారి పడి వృద్ధురాలి మృతి

చిత్తూరు రూరల్: వృద్ధురాలు మరుగుదొడ్డిలో కాలుజారి పడి మృతి చెందిన సంఘటన బుధవారం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చోటుచేసుకుంది. వైద్య సిబ్బంది కథనం మేరకు, గుడిపాల మండలం పిళ్లారికుప్పం గ్రామానికి చెందిన కన్నమ్మ (75) కాళ్ల నొప్పులతో సోమవారం ఆస్పత్రిలో చేరింది. ఆస్పత్రిలో ఆర్థో వార్డులో చికిత్స పొందుతున్న ఆమె బుధవారం ఉదయం కాలకృత్యాల కోసం మరుగుదొడ్డిలోకి వెళ్లింది. ఈ క్రమంలో అక్కడే కిందపడి సంఘటన స్థలంలోనే మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

పలమనేరు: పలమనేరు సెబ్ పరిధిలోని కీలపట్ల క్రాస్ వద్ద అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న గంగవరం మండలం కీలపట్ల మాదిగపల్లెకు చెందిన భద్రయ్య(68)ను అరెస్ట్ చేసి అతని నుంచి 160 టెట్రా ప్యాకెట్లను సీజ్ చేసినట్టు డీటీఎఫ్ ఎస్ఐ మాధవస్వామి బుధవారం తెలిపారు.

నవరత్న పథకాలతో పేదలకు లబ్ధి

- పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు
- సరకల్లు పంచాయతీలో గడప గడపకు తిరిగి సంక్షేమ పథకాలపై ఆరా

తవణంపల్లె: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన నవరత్న పథకాల్లో ప్రతి ఇంటికి ఫలాలు అందాయని పూతలపట్టు ఎమ్మెల్యే ఎం.ఎస్. బాబు అన్నారు. ఆయన బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని సరకల్లు పంచాయతీలోని గ్రామాల్లో పర్యటించారు. ఇంటింటికీ తిరిగి ఏ పథకం ద్వారా ఎవరెవరు ఎంత లబ్ధి పొందారో బుక్‌లెట్ చదివి వివరించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు వస్తున్నారా అని ఆరా తీశారు. అర్హులుగా ఉండి సంక్షేమ పథకాలు అందలేదంటే వెంటనే మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. సంక్షేమ పథకాల సారథి జగనన్నకు వచ్చే ఎన్నికల్లో అందరూ అండగా నిలవాలని కోరారు. ఇంటింటికీ పథకాలు అందాలంటే జగన్‌మోహన్ రెడ్డిని మరో సీఎంగా గెలిపించుకోవాలని సూచించారు. గత ప్రభుత్వంలో పింఛన్లు తీసుకోవాలంటే పడిగాపులు కాసే పరిస్థితి ఉండేదని గుర్తుచేశారు. ప్రస్తుతం సూర్యుడు ఉదయించక ముందే పింఛను డబ్బులు తలుపు తట్టి చేతికి ఇస్తున్నారని స్పష్టం చేశారు. టీడీపీ నాయకులు చెప్పే తప్పుడు ఆరోపణలను నమ్మొద్దని సూచించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

సరకల్లు పంచాయతీలోని గ్రామాల్లో ఇంటింటికీ తిరిగిన ఎమ్మెల్యే బాబుకు స్థానికులు సమస్యలను విన్నవించారు. ఇంటి పట్టాలు, పక్కాగృహాలు మంజూరు చేయాలని, డ్రైనేజీ కాలువలు నిర్మించాలని, ఇళ్లకు దగ్గరగా ఉన్న విద్యుత్ తీగలను తొలగించాలని, అదనపు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని, సిమెంటు రోడ్లు నిర్మించాలని కోరగా, వెంటనే వాటిని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు.

అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలి

అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలని ఎమ్మెల్యే అన్నారు. సరకల్లులోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలకు, హెల్పర్లకు రెండు జతల యూనిఫాంను పంపిణీ చేశారు. ఐరాల సీడీపీఓ నిర్మల మాట్లాడుతూ పూతలపట్టు, ఐరాల, తవణంపల్లె మండలాల్లోని 213 అంగన్‌వాడీ కేంద్రాల్లో 426 మందికి,158 మంది హెల్పర్లకు రెండు జతల యూనిఫాంను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అన్ని అంగన్‌వాడీ కేంద్రాల దగ్గర కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయడానికి ఏడు రకాల విత్తనాలను అందజేసినట్లు వివరించారు. కార్యక్రమాల్లో మండల సచివాలయ కన్వీనర్ హరికృష్ణారెడ్డి, సరకల్లు సర్పంచ్ సతీష్‌రెడ్డి, ఎంపీటీసీ బుజ్జి, ఎంపీడీఓ అబ్దుల్‌కలాంఆజాద్, ఎంఈఓ హేమలత, వ్యవసాయాధికారి ప్రవీణ్, వైద్యాధికారి మోహన్‌వేలు, పీఆర్ఏఈ గురువారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఈశ్వర్, ఏపీఓ లలిత, ఏపీఎం రవి, సీడీపీఓ నిర్మల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత, మండల పార్టీ కన్వీనర్ హరిరెడ్డి వైఎస్సార్‌సీపీ నాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.



సరకల్లులో ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలను వివరిస్తున్న పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, అధికారులు, పార్టీ నాయకులు



సరకల్లు అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్తలు, హెల్పర్లకు యూనిఫాంను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

వాలీబాల్ విజేత కొత్తపల్లె-ఏ జట్టు



విజేతగా నిలిచిన కొత్తపల్లె-ఏ జట్టు

గుడిపాల: మండలంలోని పాపిశెట్టిపల్లెలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్‌లో విజేతగా కొత్తపల్లె జట్టు నిలిచింది. పాపిశెట్టిపల్లె యువత ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్‌లో 16 జట్లు పాల్గొన్నాయి. హోరాహోరీగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో కొత్తపల్లె-బి జట్టుపై కొత్తపల్లె-ఏ జట్టు విజేతగా నిలిచింది. మొదటి రెండు బహుమతులను కొత్తపల్లె జట్లు గెలుచుకున్నాయి. మూడవ బహుమతి పేయనపల్లె జట్టుకు దక్కింది.

తప్పుల్లేని జాబితా రూపొందించండి



సర్వే కార్యక్రమంలో మధుసూదన్ రెడ్డి

గుడిపాల: తప్పుల్లేకుండా ఓటర్ జాబితాను రూపొందించాలని మండల స్పెషలాఫీసర్ మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. ఓటర్ల జాబితాపై మండలంలోని చీలాపల్లెలో బుధవారం బీఎల్‌ఓల ఇంటింటా సర్వే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కొత్త ఓటర్ల జాబితాలతో ఆగస్టు 21 వరకు బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి సర్వే తప్పనిసరిగా చేయాలన్నారు. ఓటర్ల పేర్లు, ఆధార్ నెంబర్లు, ఇంటిపేర్లు తదితర వివరాలు జాబితాలో సరిగ్గా ఉన్నాయా? లేదా అని సరిచూసుకోవాలని పేర్కొన్నారు. సర్వే సమయంలో రాజకీయ పార్టీల ఏజెంట్లు కూడా ఉండి బీఎల్‌ఓలకు సహకరించాలని సూచించారు.

ఉత్తమ సేవలకు ప్రశంసాపత్రాలు





ప్రశంసాపత్రాలందుకుంటున్న రవిశేఖర్, హేమలత

చిత్తూరు కలెక్టరేట్ : విధుల్లో ప్రత్యేక ప్రతిభ చూపిన సమగ్రశిక్ష శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రవిశేఖర్‌కు, అధ్యాపకురాలు హేమలతకు 77వ స్వాతంత్ర్య వేడుకల్లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉషశ్రీ చరణ్, కలెక్టర్ షణ్మోహన్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందజేశారు.

విద్యార్థుల్లో సృజనను వెలికితీయాలి

వి.కోట: విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా సైన్స్ అధికారి ఆర్వీ రమణ అన్నారు. బుధవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఇన్‌స్పైర్ మనక్ నామినేషన్లపై ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో సృజనాత్మకతను గుర్తించి, వారిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ పర్యవేక్షిస్తుందన్నారు. ప్రతి ఉన్నత పాఠశాల నుంచి 5 నామినేష న్లు, ప్రాథమికోన్నత పాఠశాల నుంచి 3 నామినేషన్లు ఈ నెలాఖరులోపు ఇన్‌స్పైర్ మనక్ సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు సైన్స్ ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ చంద్రశేఖర్, ఎన్‌జీసీ జిల్లా కో-ఆర్డినేటర్, బాల చైతన్య ఆర్పీలు మోహన్‌రావ్, మోహన్ సింగ్, పలు పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ మెరుగైన వైద్యం



ఐరాల: వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్



యాదమరి: వేపనపల్లెలో సేవలందిస్తున్న వైద్యులు

ఐరాల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో ప్రతి ఇంటికీ మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని మొరంపల్లెలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వైద్య శిబిరంలో డాక్టర్ 70 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతోపాటు ఇంటి ఆవరణలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

యాదమరి: మండల పరిధిలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలను గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు అనిల్‌కుమార్ నాయక్ కోరారు. బుధవారం మండలంలోని వేపనపల్లె గ్రామంలో 104 వైద్య శిబిరం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి రోగులు ఉంటే వారికి చికిత్సలు నిర్వహించి మందులు ఉచితంగా అందించారు. అనంతరం గ్రామీణులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ ద్వారా వైద్యులు మీ ఇంటి వద్దకే వస్తున్నారని, గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో లక్ష్మీనారాయణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గుడిపాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ హరి

ఇంటివద్దకే వైద్యం

గుడిపాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజిషియన్ విధానంతో ప్రజల ఇంటి వద్దకే వైద్యం వస్తోందని ప్రాథమిక వైద్యాధికారి హరి అన్నారు. మండలంలోని చిత్తపారలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. బీపీ, చక్కెర వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఇందులో 63 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారికి ఇంటి వద్దనే ఆరోగ్య సేవలను అందించారు. వైద్య సిబ్బంది హేమలత, చంద్ర, సంధ్య, ఇందుమతి, మంజుల, కోకిల తదితరులు పాల్గొన్నారు.